
# బాలగోపాల్ యాదిలో

బాలగోపాల్‌గారు మనందరికీ దూరమై మూడు సంవత్సరాలైంది. ఈ మూడేళ్లలో రాష్ట్రం, దేశం ఎదుర్కొన్న అనేక సమస్యలు ఆయన్ని మనకు మళ్ళీ మళ్ళీ గుర్తు చేస్తూనే ఉన్నాయి. తెలంగాణ ఆకాంక్ష అన్ని విధాలా న్యాయమైనదని ప్రకటించిన వ్యక్తి ఎన్నేళ్ళయినా పరిష్కారం దిశగా అంగుళం ముందుకు కదలని ఆ ఉద్యమం గురించి ఏ పరిష్కారాలను సూచించేవారో; హక్కుల ఉద్యమం కారంచేడు నుంచి ఎంతో నేర్చుకుందని పదే పదే చెప్పిన వ్యక్తి నాలుగు నెలలు గడిచినా లక్ష్మింపేట దళితుల ఊచకోతపై చార్జిషీటు దాఖలు చేయని పోలీసులకు ఎన్ని రాజ్యాంగ'పాఠాలు' నేర్పేవారో; రాబోయే కాలమంతా ఛత్తీస్‌గఢ్‌లో రక్తపుటేరులు పారతాయి, దాన్ని నిలవరించడానికి ముందుకు రండి అని 2006 లోనే మేధావులను క్రియాశీలుల్ని చేయడానికి ప్రయత్నించిన వ్యక్తి రాజ్యం తూటాలకు బలైన సర్కెగూడ ఆదివాసుల కోసం దేశమంతా తిరిగి ఎంత మద్దతు కూడగట్టేవారో; వాన్‌పిక్ తదితర ప్రాజెక్టుల్లో అందరూ కేవలం స్కాంలనే చూస్తుంటే వాటి వెనక పొంచి ఉన్న విధ్వంసక అభివృద్ధి మహమ్మారి గురించి ఎన్ని విశ్లేషణాత్మక వ్యాసాలు రాసి ఉండేవారో; మళ్ళీ మొదలైన రైతుల ఆత్మహత్యలు, సుప్రీంకోర్టుకి వెళ్ళి ఆగిపోయిన వాకపల్లి రేప్ కేసు, చమురు వెలికితీత వల్ల కుంగిపోతున్న గోదావరి డెల్టా... ఇలా హక్కుల ఉద్యమం తన సామర్థ్యాన్ని, పనితనాన్ని నిరూపించుకోవాల్సి వచ్చిన ప్రతి సందర్భం ఆయనను గుర్తు చేసింది. సాధించిన కొద్దిపాటి విజయాలలో బాలగోపాల్‌గారి గుర్తులను వెతుక్కుంటూ ముందుకు సాగడమొక్కటే మేము ఆయనకు ఇవ్వగల నివాళి.




హక్కుల సదస్సు

ప్రస్తుతం హైదరాబాద్‌లో జీవవైవిధ్యం మీద ఒక అంతర్జాతీయ సమావేశం జరుగుతున్నది. 150 దేశాల ప్రతినిధులొచ్చి జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడానికి మనమంతా కలిసి తీసుకోవలసిన చర్యల గురించి సుదీర్ఘంగా చర్చలు జరుపుతున్నారు. ఇదంతా జీవరాశులమీద నిజంగా ప్రేమతో చేస్తున్నారా లేక జీవవైవిధ్యాన్ని కోల్పోవడం మానవ మనుగడకే ప్రమాదకరమన్న భయంతో చేస్తున్నారా అనేది పక్కన పెడితే ఈ స్పృహ ప్రభుత్వాలలో కలిగించిందెవరు? ఈ చెట్లను నరికేస్తే మాకు వర్షాలు రావు, ఈ కొండల్ని పగలగొడితే మా నదులు పారవు, ఈ రసాయనాలు వాడితే మా చేపలు చనిపోతాయి... ఇలాంటి ఎన్ని వ్యక్తిస్థాయి, గ్రామస్థాయి ఉద్యమాలు జరిగితే ఈ అవగాహన నీటివనరుల సంరక్షణ ఉద్యమాలుగా, అటవీ పరిరక్షణ ఉద్యమాలుగా, కాలుష్య వ్యతిరేక ఉద్యమాలుగా ఒక వైపు; వన్యసంరక్షణ కేంద్రాలుగా, అభయారణ్యాలుగా, జీవవైవిధ్య ప్రాంతాలుగా మరోవైపు రూపుదిద్దుకుంటూ వచ్చి ఇవ్వాళ అంతర్జాతీయ ఒడంబడికల స్థాయికి ఎదిగాయి! అంటే ఇదంతా ప్రజల వివేకం నుంచి పుట్టి వారి ఆందోళనల ఫలితంగా రూపుదిద్దుకున్నదే.

కింది నుంచి పైకి వెళ్ళిన ఈ జ్ఞానం స్థానిక ప్రభుత్వాల బుర్రల్లోకి మాత్రం ఎందుకు వెళ్ళలేకపోతోంది? ఇంత పెద్ద సమావేశం ఇక్కడ జరగబోతోందని తెలిసి కూడా మన రాష్ట్ర ప్రభుత్వం గత ఐదారేళ్ళలో పర్యావరణ రీత్యా ఎంతో ప్రాముఖ్యమున్న ప్రాంతాలను పోలవరం వంటి భారీ డ్యాంలకు, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు, సెజ్‌లకు, కోస్టల్ కారిడార్లకు, ఓపెన్‌కాస్ట్ గనులకు, బాక్సైట్ తవ్వకాలకు, యురేనియం వెలికితీతకు, అణువిద్యుత్ కేంద్రాలకు ధారాదత్తం చేసింది. ఇంకా చేస్తూనే ఉంది. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? కుడిచెయ్యి ఏం చేస్తున్నదో ఎడమ చెయ్యికి తెలియదనుకోవాలా? వ్యాపార ప్రయోజనాలు తప్ప మరేమీ పట్టవనుకోవాలా? ఒకవైపు సముద్ర తీర ప్రాంతాలను, చిత్తడి నేలలను, మడ అడవులను, సహజ వ్యవసాయాన్ని... కాపాడేందుకు ప్రయత్నిస్తున్నవారిని శత్రువులుగా పరిగణిస్తూ, వారి మీద కేసులు పెడుతూ, కాల్పులు జరుపుతూ, ప్రాణాలు తీస్తూ మరోవైపు హోర్డింగ్‌ల ద్వారా, ప్రకటనల ద్వారా, రోడ్డు నడిమధ్యలో పచ్చదనం నింపడం ద్వారా జీవవైవిధ్య ప్రాముఖ్యం గురించి తిరిగి మనకే చెప్పబూనుకోవడం ఏ రకమైన దగుల్బాజీతనం? పర్యావరణ వాత్సల్య రాష్ట్రంగా వచ్చే బ్రాండ్ ఇమేజ్ కంటే సదస్సు నిర్వహణ వల్ల హైదరాబాద్‌కు వచ్చే బ్రాండ్ ఇమేజ్ దానికి ఎందుకు ఎక్కువయింది? ఇంగితజ్ఞానం ఉన్న ప్రతి ఒక్కరికీ తోచే ప్రశ్నలివి. కాని మన ప్రభుత్వం మాత్రం వీటికి సమాధానం చెప్పడం తన బాధ్యత అనుకోవడం లేదు.

ప్రతి ఉద్యమం, ఆందోళన, పోరాటం ఏదో ఒక దశలో కోర్టులను ఆశ్రయించక తప్పని పరిస్థితి ఉంది ఇవ్వాళ మన దేశంలో. కాని జీవితం, జీవనం కోల్పోతున్న వాళ్లు కోర్టులను ఆశ్రయిస్తున్నంత వేగంగా కోర్టులు వారి ఫిర్యాదుల మీద స్పందించడం లేదు. అభివృద్ధి పథకాల పేరు మీద జరుగుతున్న విధ్వంసం, సాగుతున్న పోలీసు నిర్బంధంపై న్యాయ నిర్ణయాలు వెలువడడంలో విపరీతమైన జాప్యం జరుగుతోంది. నర్మదా నుంచి సోంపేట వరకు, వేదాంత నుంచి కూడంకుళం వరకు అందరూ ఆ క్యూలో నిలబడే ఉన్నారు ఇప్పటికీ. ఒక నరోడా పాటియా కేసులో, ఒక వాకపల్లి కేసులో ఎంతో కొంత న్యాయం సాధించుకున్నందుకు ఇవ్వాళ మనం సంతోషిస్తుండొచ్చు కాని ఎంత జాప్యం తరవాత, ఎంత ప్రయత్నం తర్వాత వాటిని మనం సాధించుకోగలిగామో తెలిసినవాళ్లు కోర్టుల మీద అదే ఆశను నిలుపుకోగలరా?





బాలగోపాల్‌గారి

**Of Capital And Other Punishments**

(HRF Publication)

**మనిషి మార్క్సిజం**

(పర్‌స్పెక్టివ్ ప్రచురణ)




**పుస్తకావిష్కరణలు జరుగుతాయి**

**బాలగోపాల్‌గారి** మూడవ వర్ధంతి సందర్భంగా మేము నిర్వహిస్తున్న హక్కుల సదస్సులో ఇదొక ప్రధాన అంశం. 'ప్రపంచీకరణ – జీవవైవిధ్యం – ప్రత్యామ్నాయాలు' అనే అంశం మీద ప్రముఖ పర్యావరణవేత్త ఆశిష్ కొఠారి మాట్లాడతారు.

ఇటీవల వార్తల్లో ఎక్కువగా కనిపిస్తున్న ఒక ప్రజాందోళన తమిళనాడులోని కూడంకుళం ప్రజలది. మెడలోతు నీళ్ళలో, ఇసకలో నిలబడి తమకు రాబోయే పీకల్లోతు కష్టాల గురించి ప్రపంచానికి తెలియజెపుతున్నారు వాళ్ళు. ఫుకుషిమా అణురియాక్టర్ దుర్ఘటన తర్వాత కూడా వారి న్యాయమైన భయాందోళనలకు స్పందించని ప్రభుత్వాలను ఏమనాలి? ఈ విషయంలో ప్రధాని మన్మోహన్ సింగ్ నుంచి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జయలలిత వరకూ అందరూ అణుశక్తి గొప్పతనం గురించి మళ్లీ మళ్లీ అవే మాటలు వల్లెవేస్తున్నారు తప్ప ప్రపంచానికంతటికీ తెలిసిన చేదు అనుభవాల ఊసు ఎత్తడం లేదు. చేపలు పట్టుకుని బతికే మత్స్యకారులే చెర్నోబిల్ గురించి, ఫుకుషిమా గురించి, అణుధార్మిక శక్తి వల్ల ప్రపంచానికి కలుగబోయే హాని గురించి మాట్లాడాల్సి వస్తోంది. ఆ మాటలు మాట్లాడుతున్నందుకు, అణువిద్యుత్ కేంద్రాన్ని అడ్డుకుంటున్నందుకు ఒకళ్లిద్దరి మీద కాదు వేల మంది మీద ప్రభుత్వం కేసులు పెట్టింది. ఒక పదివేల మంది మీద అయితే ఏకంగా 'రాజద్రోహం' కేసులే పెట్టింది. ఇక్కడ రాజెవరు? అణుశక్తా? ఆ పరికరాలను, ఇంధనాన్ని మనకు అమ్ముతున్న అమెరికన్ కంపెనీలా?

ఈ పోరాటం కూడంకుళం మత్స్యకారులు తమ నేల కోసం, తమ జీవనం కోసం జరుపుతున్న పోరాటంగానే చాలామందికి కనిపించవచ్చు. కాని అటువంటి ఒక అణువిద్యుత్ కేంద్రం మన దాకా రాకుండా, దాని దుష్ఫలితాలు మన పిల్లల దాకా రాకుండా మనందరి తరపున ఆ బరువును వాళ్లు తమ భుజాల మీద మోస్తున్నారనే సంగతి మనం మర్చిపోకూడదు.

**బాలగోపాల్‌గారి** మూడో వర్ధంతి సందర్భంగా మేము నిర్వహిస్తున్న హక్కుల సదస్సులో ఇది మరొక ముఖ్యమైన అంశం. 'అణువిద్యుత్– కూడంకుళం పోరాటం' గురించి ఆ పోరాట సంఘీభావ కమిటీలో సభ్యుడూ, రచయితా, సామాజిక కార్యకర్తా అయిన నిత్యానంద్ జయరామన్ మాట్లాడతారు.

**బాలగోపాల్‌గారి** మూడవ వర్ధంతి సందర్భంగా మేము నిర్వహిస్తున్న హక్కుల సదస్సులో ఇది కూడా ఒక ముఖ్య అంశం. 'సామాజిక న్యాయసాధనలో చట్టం పాత్ర'పై సుప్రీంకోర్టు లాయరు నిత్యా రామకృష్ణన్ మాట్లాడతారు. అందరూ ఆహ్వానితులే

## సదస్సు

తేదీ : **7-10-2012 ఆదివారం**

సమయం : **ఉ. 10 నుండి సా. 5 గం. వరకు**

స్థలం : **భారతీయ విద్యాభవన్ సెమినార్ హాల్**
(కింగ్‌కోఠి, నిజాం కాలేజి పక్కన)

ఉదయం : **బాలగోపాల్ – హక్కుల ఉద్యమం**
ఎ. చంద్రశేఖర్, మానవహక్కుల వేదిక ఉపాధ్యక్షుడు

**ప్రపంచీకరణ – జీవవైవిధ్యం – ప్రత్యామ్నాయాలు**
ఆశిష్ కొఠారి, పర్యావరణవేత్త, 'కల్పవృక్ష' సభ్యుడు

మధ్యాహ్నం : **అణువిద్యుత్–కూడంకుళం పోరాటం**
నిత్యానంద్ జయరామన్, రచయిత, సామాజిక కార్యకర్త

**సామాజిక న్యాయంలో చట్టం పాత్ర**
నిత్యా రామకృష్ణన్, సుప్రీంకోర్టు న్యాయవాది

4-10-2012

మానవహక్కుల వేదిక
Human Rights Forum (HRF)

ప్రచురణ : ఎస్. జీవన్ కుమార్, ఫోన్ : 98489 86286; వి.ఎస్. కృష్ణ, ఫోన్ : 94404 11899